
# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు




**స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యం పెంపే లక్ష్యం..**

**డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో ఎమ్మెల్యే అరవిందబాబు భేటీ**

నరసరావుపేట,రక్షణ న్యూస్



మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

ఆదివారం 23 ఆగస్టు 2026 పేజీలు : 4


ఎడిటర్ నరేంద్ర



# పురపోరులో 'పవర్ గేమ్'...

## ఎమ్మెల్యేల పెత్తనానికి చెక్?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ఈసారి సాధారణ పురపోరు కాదు.. ఎమ్మెల్యేల రాజకీయ ఆధిపత్యానికి, స్థానిక నేతల వ్యక్తిగత బలానికి, కూటమి ప్రభుత్వ పనితీరుకు ఏకకాలంలో పరీక్షగా మారనున్నాయి. మేయర్లు, చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానం అమల్లోకి వస్తే గుంటూరు, తెనాలి, మంగళగిరి, పొన్నూరు, బాపట్ల, చీరాల, రేపల్లె, చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల తదితర పట్టణాల్లో రాజకీయ లెక్కలు తారుమారయ్యే అవకాశం ఉంది. ఎమ్మెల్యే అభ్యర్థిని నిర్ణయించగలిగినా.. గెలిపించేది మాత్రం ప్రజలే కావడంతో అసలు పరీక్ష మొదలవుతోంది.

వివరాలు 2లో..




# పురపోరులో 'పవర్ గేమ్'.. ఎమ్మెల్యేల పెత్తనానికి చెక్?

మొదటి పేజీ తరువాయి

ఎడిటర్ నరేంద్ర...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ఈసారి కేవలం వార్డు పోరు కాదు.. అధికార పార్టీ ఎమ్మెల్యేల రాజకీయ పట్టు, స్థానిక నేతల వ్యక్తిగత బలం, ప్రతిపక్షాల పునరాగమనానికి పరీక్షగా మారనున్నాయి. మేయర్లు, చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానం అమల్లోకి వస్తే.. పట్టణాల్లో ఇప్పటివరకు ఎమ్మెల్యేల చుట్టూ తిరిగిన రాజకీయం కొత్త మలుపు తిరగనుంది.గుంటూరు నుంచి తెనాలి వరకు.. మంగళగిరి నుంచి పొన్నూరు వరకు.. చిలకలూరిపేట నుంచి సత్తెనపల్లి వరకు.. వినుకొండ నుంచి మాచర్ల, పిడుగురాళ్ల వరకు.. బాపట్ల, చీరాల, రేపల్లె ప్రాంతాల్లోనూ మున్సిపల్ రాజకీయాల్లో కొత్త లెక్కలు మొదలుకానున్నాయి. ఇప్పటివరకు కౌన్సిలర్లను గెలిపించడం, వారిని తమవైపు తిప్పుకోవడం, మెజారిటీ సాధించడం ద్వారా మేయర్, చైర్‌పర్సన్ పదవులను నిర్ణయించే పరిస్థితి ఉండేది. ఇక ఆ రాజకీయానికి బదులు "ప్రజలు ఎవరిని కోరుకుంటున్నారు?" అనేదే అసలు ప్రశ్న కానుంది.ఇదే ఎమ్మెల్యేలకు మొదటి రాజకీయ పరీక్ష. ఒక పట్టణంలో ఎమ్మెల్యేకు బలమైన పట్టు ఉందనుకుందాం. ఆయన సూచించిన అభ్యర్థికి పార్టీ టికెట్ దక్కుతుంది. కానీ ప్రత్యక్ష ఎన్నికల్లో ఆ అభ్యర్థి గెలవాలంటే ఎమ్మెల్యే అండ ఒక్కటే సరిపోదు. పట్టణ ప్రజల్లో వ్యక్తిగతంగా ఎంత బలం ఉంది? సామాజికంగా ఎంత ఆదరణ ఉంది? స్థానిక సమస్యలపై ఏ స్థాయిలో పోరాడారు? అన్నది ప్రజలు లెక్కలోకి తీసుకుంటారు.అంటే ఎమ్మెల్యే టికెట్ ఇప్పించగలడు.. కానీ ఓటు ఇప్పించలేడు అన్న పరిస్థితి రావచ్చు. ఇదే ప్రత్యక్ష ఎన్నికల విధానంలో ఉన్న అసలు రాజకీయ మార్పు.ఉదాహరణకు తెనాలిలో ఒక స్థానిక నాయకుడికి మంచి వ్యక్తిగత పరిచయం ఉందనుకుందాం. ఇప్పటి విధానంలో అతను కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకోవాల్సి ఉంటుంది. ప్రత్యక్ష ఎన్నికల్లో మాత్రం నేరుగా ప్రజల్లోకి వెళ్లి పోటీ చేయవచ్చు. ప్రజలు అతనికి అనుకూలంగా తీర్పు ఇస్తే.. ఎమ్మెల్యే రాజకీయ బలానికి సమాంతరంగా మరో ప్రజాబలం తయారవుతుంది.అదే పరిస్థితి మంగళగిరి, బాపట్ల, చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పొన్నూరు, రేపల్లె, చీరాల, పిడుగురాళ్ల వంటి పట్టణాల్లోనూ కనిపించవచ్చు. స్థానికంగా బలమైన నాయకులను ఎమ్మెల్యేలు తమతో కలుపుకొని నడిపిస్తారా? లేక వారినే భవిష్యత్తు రాజకీయ ప్రత్యర్థులుగా చూస్తారా? అన్నది కూడా ఆసక్తికరంగా మారనుంది.చంద్రబాబు నిర్ణయం వెనుక ఈ రాజకీయ కోణాన్ని విస్మరించలేం. ప్రతి పట్టణంలో ఎమ్మెల్యేపైనే ఆధారపడే నాయకత్వానికి బదులుగా.. ప్రజల్లో సొంత ఇమేజ్ ఉన్న నాయకులను పెంచుకోవడం కూటమికి దీర్ఘకాలికంగా ఉపయోగపడవచ్చు. ఈరోజు మేయర్‌గా, చైర్‌పర్సన్‌గా గెలిచిన వ్యక్తి రేపు జిల్లా రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదగవచ్చు. అవసరమైతే భవిష్యత్తులో అసెంబ్లీ టికెట్ ఆశించే స్థాయికీ చేరుకోవచ్చు.కానీ ఇదే నిర్ణయం చంద్రబాబు ప్రభుత్వానికి డబుల్ ఎడ్జ్ స్వోర్డ్ లాంటిది. కూటమి బలమైన అభ్యర్థులను నిలబెట్టి పట్టణాల్లో గెలిపించుకుంటే ప్రభుత్వానికి రాజకీయంగా భారీ క్రెడిట్ వస్తుంది. కానీ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే మద్దతు ఉన్న అభ్యర్థి ఓడిపోయి, ప్రజలు వేరే వ్యక్తిని ఎన్నుకుంటే.. ఆ ఫలితాన్ని కేవలం మున్సిపల్ ఓటమిగా తీసుకోవడం కష్టం. అది ఎమ్మెల్యే పనితీరుపై ప్రజల తీర్పుగా కూడా ప్రచారం అయ్యే అవకాశం ఉంది.ప్రతిపక్షాలకు ఇదే పెద్ద ఆయుధం. "మీ ఎమ్మెల్యే ఉన్నాడు.. ప్రభుత్వం ఉంది.. మరి మీ పట్టణం ఎందుకు మారలేదు?" అంటూ స్థానిక సమస్యలను ముందుకు తెచ్చి ఎన్నికలను ప్రభుత్వ వ్యతిరేకతకు వేదికగా మార్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పట్టణ అభివృద్ధి, ఆస్తిపన్నులు వంటి సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి ఉంటే.. ప్రత్యక్ష ఎన్నికల్లో అది నేరుగా చైర్‌పర్సన్ లేదా మేయర్ అభ్యర్థి ఓట్లపై ప్రభావం చూపొచ్చు.మరోవైపు ఒకే పార్టీకి చెందిన ఎమ్మెల్యే, మేయర్ కలిసి పనిచేస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడం.. మేయర్ వాటిని పట్టణంలో అమలు చేయడం.. అభివృద్ధి ఫలితాలు ప్రజలకు కనిపించడం జరిగితే ఇద్దరికీ రాజకీయ లాభమే. కానీ ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు మొదలైతే మాత్రం పట్టణ పాలన కంటే 'ఎవరి మాట నెగ్గుతుంది?' అనే పవర్ గేమ్ ముందుకు వచ్చే ప్రమాదం ఉంది.అందుకే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఎన్నికలు కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు. గుంటూరు మేయర్ నుంచి బాపట్ల, చీరాల, రేపల్లె చైర్‌పర్సన్ వరకు.. ప్రతి పదవీ ఒక రాజకీయ శక్తి పరీక్ష. ఎమ్మెల్యే ప్రభావం ఎంత? స్థానిక నాయకుడి వ్యక్తిగత బలం ఎంత? పార్టీ గుర్తుకు ఎంత ఓటు ఉంది? ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం ఏంటి? ప్రతిపక్షం పుంజుకుందా? అన్నదానికి ఫలితాలు అద్దం పట్టనున్నాయి.చంద్రబాబు నిర్ణయం ఎమ్మెల్యేల చేతుల్లో ఉన్న స్థానిక రాజకీయ రిమోట్‌ను కొంతవరకు ప్రజల చేతుల్లో పెట్టే ప్రయత్నమా? లేక భవిష్యత్తు పట్టణ రాజకీయాలకు కొత్త నాయకత్వాన్ని తయారు చేసే వ్యూహమా? అన్నది ఎన్నికల తర్వాతే పూర్తిగా తేలుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం.. ఈసారి మున్సిపల్ పోరులో కౌన్సిలర్ల లెక్కల కంటే ప్రజల తీర్పే పెద్ద లెక్క. ఆ తీర్పు ఎమ్మెల్యేలకు రాజకీయ హెచ్చరికగా మారుతుందా.. కూటమికి బలపరీక్షగా నిలుస్తుందా.. ప్రతిపక్షానికి పునరుజ్జీవనంగా మారుతుందా అన్నదే అసలు ఆసక్తి.

# పుట్టలమ్మతల్లి ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం

## నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే రామాంజనేయులు శుభాకాంక్షలు

**గుంటూరు రక్షణ న్యూస్**



గుంటూరు రూరల్ మండలం చల్లవారిపాలెం గ్రామంలోని శ్రీ పుట్టలమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం నియమించిన 10 మంది నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యులుగా సుధా పిచ్చయ్య, మద్రిశెట్టి శివపార్వతి, వాస నాగేశ్వరరావు, చోడవరపు శ్రీవల్లి సుబ్బలక్ష్మి, పెద్ద పరుపు ప్రసాద్, జానారపు భవాని, వి. అనురాధ, నల్లపాటి నాగేశ్వరరావు, అర్థాల శ్రీలక్ష్మి, డి. రాంబాబు ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టలమ్మతల్లి అమ్మవారి ఆశీస్సులతో దేవస్థానం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ నూతన పాలకవర్గం సమష్టిగా, పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. అమ్మవారి సేవలో అంకితభావంతో పనిచేసి దేవస్థానం ప్రతిష్ఠను మరింత పెంచాలని నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో గాదె వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

మొదటి పేజీ తరువాయి

**నరసరావుపేట,రక్షణ న్యూస్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 105 చారిత్రాత్మక నిర్ణయమని నరసరావుపేట ఎమ్మెల్యే, బీసీ శాసనసభ కమిటీ సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై ఇరువురూ చర్చించారు.గ్రామీణ స్థానిక సంస్థల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్‌పర్సన్ పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు అరవిందబాబు తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు చెప్పారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్ననిర్ణయం సామాజిక న్యాయానికి మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు.

**ఎన్నికల నిర్వహణపై కసరత్తు...**స్థానిక సంస్థల ఎన్నికలను త్వరితగతిన నిర్వహించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అరవిందబాబు తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ నాటికి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

**నామినేటెడ్ పదవుల్లోనూ 34 శాతం...**నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌లు, మేయర్లను ప్రజలు నేరుగా ఎన్నుకునే విధానాన్ని ప్రతిపాదించినట్లు చెప్పారు. ప్రస్తుత జిల్లాల ప్రాతిపదికన జిల్లా పరిషత్‌ల సంఖ్యను 13 నుంచి 28కు పెంచే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు.బీసీలకు రాజకీయంగా, సామాజికంగా మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అరవిందబాబు పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీసీలకు రాజకీయ అవకాశాలు మరింత విస్తరిస్తాయని అన్నారు. నిర్ణయం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని డిప్యూటీ స్పీకర్‌తో చర్చించినట్లు తెలిపారు.

# పచ్చదనం.. పరిశుభ్రతతో ప్రగతి

**కర్లపాలెం రక్షణ న్యూస్**

పచ్చని చెట్లు పెంచుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌తో పాటు స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కర్లపాలెం ప్రత్యేక అధికారి ఆర్. ఘననాథ్ పిలుపునిచ్చారు.కర్లపాలెం స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి ఆర్. ఘననాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లను విరివిగా పెంచడం, పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ఇళ్లు, పాఠశాలలు, రహదారులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుభిక్షమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా,



తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచి ంచారు. పరిసరాల పరిశుభ్రత తో పాటు మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవా లని అన్నారు.అనంతరం రహదారి పక్కన మొక్కలు నాటి, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతపై అధికా రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిం చారు. స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పీఓపీఆర్డీ అయినంపూడి శ్రీనివాసరావు, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. విజయశ్రీ, ఉపాధ్యాయులు ఇనకొల్లు పోలీసురావు, సుబ్బారెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ చొరవతో గ్యాస్ బుకింగ్ సులభతరం

**బాపట్ల రక్షణ న్యూస్**

హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు సిలిండర్ బుకింగ్‌కు 45 రోజుల నిరీక్షణతో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఇకపై బాపట్ల పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు 25 రోజులకే సాధారణ పద్ధతిలో సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది.గ్యాస్ బుకింగ్‌కు 45 రోజుల వ్యవధి విధించడంతో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ప్రత్యేక చొరవ చూపారు. వినియోగదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న అధికారులు విజయవాడ, బాంబేలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి నిరంతరం ప్రయత్నించారు.జిల్లా సివిల్ సప్లై అధికారి ఏ.



జగన్మోహన్ రావు ప్రత్యేక చొరవతో పాటు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమన్వయంతో జరిపిన ప్రయత్నాలు ఫలించాయి. దీంతో ఇకపై బాపట్ల పట్టణ హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు 25 రోజులకే బుకింగ్ అవకాశం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు.గ్యాస్ బుకింగ్ విషయంలో వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు వినియోగదారులు కృతజ్ఞతలు తెలిపారు. తాజా నిర్ణయంతో బాపట్ల పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించనుంది.

# స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యం..



## పట్టణ అధ్యక్షుడు ఆంద్రేయ

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల పట్టణంలోని 10వ వార్డు ప్యాడిసన్‌పేటలో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (స్వాస్రా) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, బాపట్ల పురపాలక సంఘ ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సూచనలతో, కమిషనర్ ఎం. హాసిని ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ పాల్గొని స్వచ్ఛత కార్యక్రమానికి మద్దతు తెలిపారు. అనంతరం వార్డులోని ప్రధాన రహదారులు, డ్రైనేజీలను మునిసిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మునిసిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు.అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్యం, పచ్చదనం, పరిశుభ్రమైన పరిసరాలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని మేనేజర్ మూకిరి చంద్ర మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ మాట్లాడుతూ, స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన బాపట్లను నిర్మించగలమన్నారు. అనంతరం మేనేజర్ ఆధ్వర్యంలో పాల్గొన్న వారందరితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేవూరి కరుణ, సయ్యద్ నజీర్, పురపాలక, సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. 10వ వార్డును పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు.

# కర్లపాలెంలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

**కర్లపాలెం రక్షణ న్యూస్**



బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం ఖలాండ్ సెంటర్‌లో మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా మెగా అభిమానులు చిరంజీవి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వ హించి, అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ సభ్యులు మనలి చైతన్య, జనసేన పార్టీ లీగల్ సెల్ సభ్యురాలు, బాపట్ల ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యురాలు జిదుగు విజయ మాధురి, పిట్లవానిపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షులు హుస్సేన్ బేగ్, కర్లపాలెం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిలకల సురేంద్ర, వీర మహిళ ఆగిశెట్టి నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.అలాగే మెగా కుటుంబ వీరాభిమానులు ఆకుల నారాయణ, ఆగిశెట్టి శ్రీకాంత్, జిదుగు రాజేష్, గాజుల శ్రీనివాసరావు, చల్లపల్లి ఏసోబు, మనలి రవికిషోర్‌తో పాటు మెగా కుటుంబ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందబాబు

**భట్టిప్రోలు రక్షణ న్యూస్**



భట్టిప్రోలు మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండప కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఆధునీకరించిన సెంట్రల్ ఏసీ కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు హాజరై కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, కళ్యాణ మండప కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ స్టేషన్లపై ఎమ్మార్వో విచారణ

**కర్లపాలెం రక్షణ న్యూస్**



కర్లపాలెం మండలంలోని పెదపులుగువారిపాలెం గ్రామంలో పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన అంశాలపై తహసీల్దార్ (ఎమ్మార్వో) రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 220, 221కు సంబంధించి అధికారులు, గ్రామస్థుల నుంచి వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన సమస్యలు, అభ్యంతరాలను అధికారులు పరిశీలించారు. సంబంధిత పత్రాలను పరిశీలించి, విచారణలో వెల్లడైన అంశాలను నమోదు చేశారు. పోలింగ్ స్టేషన్ల నిర్వహణకు సంబంధించి స్థానికంగా ఉన్న సమస్యలు, అభ్యంతరాలపై సమగ్రంగా వివరాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు .విచారణలో సంబంధిత అధికారులు పాల్గొని అవసరమైన సమాచారాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/23/2026 3:19 AM Page 4



# స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పారిశుధ్య సేవలు



**చీరాల రక్షణ న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీరాల పట్టణంలోని చిన్నపిల్లల పార్కులో శనివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొని స్వయంగా చీపురు పట్టి పార్కులో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛమైన వాతావరణం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించడంతో పాటు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. పారిశుధ్య సిబ్బందితో పాటు ప్రజలు కూడా స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పార్కు పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే స్వయంగా పారిశుధ్య పనుల్లో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## అనారోగ్య బాధితురాలికి సీఎం భరోసా

**మార్టూరు రక్షణ న్యూస్**



అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా లభించింది. మార్టూరు మండలం దేగర్లమూడి గ్రామానికి చెందిన జంపని నాగలక్ష్మి వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం కోరగా, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,03,317 విలువైన ఎల్‌ఓసీ మంజూరైంది. మంజూరైన ఎల్‌ఓసీకి సంబంధించిన చెక్కును స్థానిక నాయకులు నాగలక్ష్మికి అందజేశారు. అత్యవసర వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడనుంది. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నాగలక్ష్మి కుటుంబానికి ఈ సాయం కొంత ఊరటనిచ్చింది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని నాయకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు ఇబ్బందులు పడుతున్న వారికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసులతో అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నాగలక్ష్మి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరుకు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నేరస్తుల కదలికల పై పోలీసుల నిఘా

**సత్తెనపల్లి రక్షణ న్యూస్**



సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీలో పోలీసులు తెల్లవారుజాము నుంచి విస్తృతంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో నలుగురు సీఐలు, తొమ్మిది మంది ఎస్ఐలు, 90 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు నేర కార్యకలాపాలను అరికట్టడమే కార్డన్ సెర్చ్ ప్రధాన ఉద్దేశమని డీఎస్పీ కృష్ణ చైతన్య తెలిపారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు నిరంతరం తనిఖీలు, నిఘా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఒకటి కంటే ఎక్కువ కేసులు ఉన్న రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించడం, నేరాలకు పాల్పడే వారిని ముందుగానే గుర్తించి నియంత్రించడం, ప్రజల్లో చట్టంపై అవగాహన పెంచడం కూడా కార్డన్ సెర్చ్ లక్ష్యాల్లో భాగమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడైనా గొడవలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 110కు డయల్ చేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చట్టవిరుద్ధంగా గొడవలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ద్వారా నేరస్తులపై పోలీసుల నిఘా మరింత పటిష్టమవుతుందని, గంజాయి, డ్రగ్స్ సహా ఇతర నేర కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

## ఆశా వర్కర్ల పనిభారం తగ్గించాలి

**బాపట్ల రక్షణ న్యూస్**



ఆశా కార్యకర్తలపై పెరుగుతున్న అదనపు పనిభారాన్ని తగ్గించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. బాబూరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) ఎస్. విజయమ్మతో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, సంబంధిత అధికారులతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల ఖాళీ పోస్టుల భర్తీ, సిమ్ రీఛార్జ్ సమస్య పరిష్కారం, ఆన్‌లైన్ యాప్‌లతో పాటు ఫిజికల్ రికార్డులు నిర్వహించాలంటూ విధిస్తున్న అదనపు పనిభారం తగ్గించడం, సచివాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కూర్చోబెట్టి సంతకాలు చేయించే విధానాన్ని నిలిపివేయడం వంటి సమస్యలను నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఫేషియల్ ఫాలోయింగ్ పేరుతో జీతాలు నిలిపివేస్తామని బెదిరింపులు చేయకుండా చూడాలని, కొత్త బాపట్ల జిల్లా ప్రాతిపదికన ఒకే తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. ఫేస్ లింక్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యను పరిష్కరించి కేంద్ర ప్రభుత్వం అందించే రూ.2,800 వాటాను రెగ్యులర్ వేతనం జమయ్యే ఖాతాలోనే జమ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను జనాభా ప్రాతిపదికన వెంటనే భర్తీ చేయాలని బాబూరావు కోరారు. సీఐటీయూ నాయకులు కె. శరత్, ఎం. కిరణ్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాల్సిన వారని, వారిని రోజంతా సచివాలయాల్లో కూర్చోబెట్టి సంతకాలు చేయించడం వంటి విధానాలను నిలిపివేయాలని కోరారు. ఆన్‌లైన్ పనులతో పాటు అదనంగా ఫిజికల్ రికార్డులు రాయించడాన్ని నిలిపివేసి పనిభారాన్ని తగ్గించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి. ధనలక్ష్మి, కార్యదర్శి ఎం. వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ జీతాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఫేస్ లింక్, సిమ్ రీఛార్జ్ తదితర సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జాయింట్ మీటింగ్‌లో లేవనెత్తిన సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ ఎస్. విజయమ్మ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు, సంబంధిత అధికారులు, ఆశా కార్యకర్తలు సౌభాగ్యం, వాణి, శారద, సుమతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

**బాపట్ల రక్షణ న్యూస్**



రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కళ్యాణ మండపంలో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం శనివారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు నిర్వహించే ఈ శిబిరంలో బాపట్ల నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు రోటరీ క్లబ్ కార్యదర్శి ఖాసీం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ ప్రియదర్శిని మాట్లాడుతూ ఆక్యుపంక్చర్‌తో పాటు డైట్ అండ్ న్యూట్రిషన్, సుజోక్ థెరపీ తదితర వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. మెడ, వెన్ను, కీళ్ల నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్, సయాటికా, ఆర్థ్రైటిస్, ఫ్రోజన్ షోల్డర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సూచనలు, చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒత్తిడి, నిద్రలేమి, జీర్ణ సంబంధ సమస్యలు, రుతుక్రమ అసౌకర్యాలు తదితర సమస్యలకు కూడా వైద్య సలహాలు అందిస్తున్నట్లు వివరించారు. శనివారం సుమారు 50 మంది వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం కూడా శిబిరం కొనసాగుతుందని, బాపట్ల నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో కోశాధికారి బాలాజీ, ఈ. హరిబాబు, రమేష్‌బాబు, కొత్త ఆంజనేయ ప్రసాదు, ఉపేంద్ర గుప్త, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/23/2026 3:19 AM Page 5



# ప్రజలకు చేరువగా సంక్షేమ ఫలాలు

**వేమూరు రక్షణ న్యూస్**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే 'రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారాన్ని విజయవంతం చేయాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.వేమూరులోని ఎన్టీఆర్ పురవేదికలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి ఇంటికీ వివరించాలని సూచించారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, మత్స్యకార భరోసా తదితర పథకాలతో పాటు సూపర్ సిక్స్ హామీల అమలును ప్రజలకు తెలియజేయాలన్నారు.ప్రతి బూత్ పరిధిలో రోజుకు కనీసం 30 ఇళ్లను సందర్శించి ప్రజల అభిప్రాయాలను సేకరించాలని, వాటిని మైటిడిపి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.



కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమమే తమ బలమని, ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని నక్కా ఆనంద బాబు కోరారు.సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, సీయూబీ ఇన్‌ఛార్జ్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, కూటమి పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారులకు తక్షణ మరమ్మతులు పూడ్చాలి

## కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలో ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను త్వరితగతిన పూడ్చాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గుంతల కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ప్రాధాన్యతా క్రమంలో రహదారి మరమ్మతులు చేపట్టాలని సూచించారు.ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్యాచ్‌వర్క్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందుగా అక్కడే మరమ్మతులు చేపట్టాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.అదేవిధంగా అవసరమైన ప్రాంతాల్లో కొత్త రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రహదారి ప్రయాణంలో ఇబ్బందులు లేకుండా చర్యలు



తీసుకోవాలని సూచించారు.సమీక్షలో ఆర్అండ్‌బీ ఈఈ వేణుగోపాల్, డీఈఈలు, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ సత్యనారాయణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# చెన్నారెడ్డి హత్య బాధాకరం



**రెంటచింతల రక్షణ న్యూస్**

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నపులూరి చెన్నారెడ్డి హత్యకు గురికావడం తీవ్రంగా బాధించిందని తెలంగాణ మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రెంటాల గ్రామంలో చెన్నారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువ వయస్సులో రాజకీయంగా ఎదుగుతున్న సమయంలో చెన్నారెడ్డి దారుణ హత్యకు గురికావడం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన చెన్నారెడ్డి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

చెన్నారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన.. ఆపద సమయంలో ధైర్యంగా ఉండాలని, మానసికంగా కుంగిపోవద్దని సూచించారు. తండ్రి, సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ నపులూరి భాస్కరరెడ్డి, కుటుంబ సభ్యులు రంగారెడ్డి, మాధవరెడ్డి, సతీమణి స్వప్నలను ఓదార్చి మనోధైర్యం కల్పించారు.కార్యక్రమంలో పాతపాటి పిచ్చిరెడ్డి, సిద్ధవటం కోటిరెడ్డి, గాలి లక్ష్మారెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం

**బాపట్ల రక్షణ న్యూస్**



సంఘమిత్ర డిఎంఎస్ శక్తి బజార్ ఆధ్వర్యంలో బాపట్ల పా త బ స్టాండ్ సమీపంలోని ఎన్జీ వో హోంలో ఉచిత వైద్య శిబి రం, మహి ళా సాధికారత సదస్సు నిర్వహిస్తున్నారు. శనివారం ప్రారం భమైన ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని బాపట్ల డిఎంఎస్ శక్తి సంఘం అధ్యక్షురాలు సీత తెలిపారు.మహిళలు ఇంటి వద్దనే ఉంటూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో డిఎంఎస్ శక్తి బజార్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ ఉత్పత్తులు, వస్తువులను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో విక్రయించుకుని ఆదాయం పొందేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి మహిళ ఆర్థికంగా స్థిరపడటంతో పాటు సాధికారత సాధించాలన్నదే డిఎంఎస్ శక్తి బజార్ ప్రధాన ఉద్దేశమని సీత పేర్కొన్నారు. మహిళల్లో స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని డిఎంఎస్ శక్తి సంఘం అధ్యక్షురాలు సీత, కార్యదర్శి సోఫియా, గ్రోత్ ఆఫీసర్ సుమ, ట్రైనింగ్ ఆఫీసర్ రేణుక, ట్రెజరర్ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ద

# రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్




**చందోలు రక్షణ న్యూస్**

చందోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులకు పోలీసులు శుక్రవారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎస్ఐ కె. మాధవరావు తెలిపారు.స్టేషన్ ఆవరణలో ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన కౌన్సెలింగ్‌లో రౌడీషీటర్లు, అనుమానితులకు చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాత కేసుల విచారణకు పోలీసులకు సహకరించాలని, మంచి ప్రవర్తనతో జీవనం సాగించాలని సూచించారు.ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనుమానితులు, రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.